క్లుప్తంగా

నేడు మెగా జాబ్‌మేళా

కంచరపాలెం: స్థానిక ఊర్వశి జంక్షన్‌లోని గౌరీ డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ అండ్ ట్రైనింగ్ ఆధ్వర్యంలో ఆదివారం మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు కళాశాల ప్రెసిడెంట్ డాక్టర్ ఎం.చంద్రశేఖరరావు, కరస్పాండెంట్ పి.ఎస్.నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. సుమారు 12 ప్రముఖ కంపెనీల్లో 1,840 ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు. పదో తరగతి నుంచి డిగ్రీ, ఐటీఐ, బీటెక్, ఫార్మసీ అర్హత గల అభ్యర్థులు ఆదివారం ఉదయం 9 గంటల నుంచి కళాశాలలో రిజిస్ట్రేషన్ చేసుకుని జాబ్‌మేళాకు హాజరు కావాలని కోరారు.

ఎర్నిమాంబ సన్నిధిలో అన్నసమారాధన



భక్తులకు అన్నప్రసాదం వడ్డిస్తున్న ఎమ్మెల్యే వంశీ కృష్ణ, ఈవో సురేష్‌బాబా తదితరులు

కంచరపాలెం: కాన్వెంటు కూడలిలోని ఎర్నిమాంబ అమ్మవారి ఆలయ వార్షికోత్సవాల్లో భాగంగా ఈవో డీవీఎస్ సురేష్‌బాబా నేతృత్వంలో శనివారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. ముందుగా అలయ అర్చకులు పులఖండం శ్రీకాంతశర్మ, పూజారి వాసుపల్లి విజయమ్మ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అన్నప్రసాదాలు అమ్మవారికి నైవేద్యంగా సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన అన్నసమారాధనను ఎమ్మెల్యే వంశీ కృష్ణ, 41వ వార్డు కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ శ్రీధర్ ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. సుమారు 6 వేల మందికి అన్నసమారాధన చేసినట్లు ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. ఆదివారం ఎర్నిమాంబ అమ్మవారి మారువారం నిర్వహిస్తున్నట్లు ఈవో సురేష్‌బాబా తెలిపారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ లండా రమణ, సిబ్బంది ప్రసాద్, రామకృష్ణ, ఆయా గ్రామాల ప్రతినిధులు, సేవా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరానికి స్పందన



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఆర్ఎంవో డాక్టర్ ఉష

అగనంపూడి: రక్తదానం చేయడానికి యువత, స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని అగనంపూడి ప్రాంతీయ ఆస్పత్రి ఆర్ఎంవో డాక్టర్ పి. ఉష అన్నారు. అగనంపూడి ఏరియా ఆస్పత్రి, అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రి సంయుక్తంగా అగనంపూడి ఆస్పత్రిలో శనివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆపదలో ఉన్న వార్ని ఆదుకోడానికి యువత దయార్థ హృదయంతో ముందుకు రావడం సంతోషంగా ఉందన్నారు. రక్తదానంపై అపోహలు విడనాడి రక్తదానం చేయాలన్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి రక్త నిధి ఇన్‌చార్జి డాక్టర్ కె.సంతోషి రూపా, డాక్టర్ భక్తవత్సల్య, డాక్టర్ అహమ్మద్, విశాఖ లయన్స్‌క్లబ్ చైర్‌పర్సన్ కిడిమి హనుమంతురావు, నాయకులు బలిరెడ్డి సత్యనారాయణ, కరణం సత్యారావు, సింగిడి సింహాచలం, అండిబోయిన మంగరాజు, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

పదోన్నతుల అంశాన్ని పునః సమీక్షించాలి



మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న ఐక్య కార్యచరణ సమితి సభ్యులు

అల్లిపురం: వార్డు ఎడ్యుకేషన్ సెక్రటరీలు, వార్డు అడ్మిన్ సెక్రటరీల పదోన్నతులపై సమీక్షించాలని వార్డు ఎడ్యుకేషన్ డాటా ప్రాసెసింగ్ సెక్రటరీల కోసం ఏర్పడిన ఐక్య కార్యచరణ సమితి సభ్యులు గ్రామ, వార్డు సచివాలయ శాఖామంత్రి డోల బాల వీరాంజనేయ స్వామి, హోమ్ మినిస్టర్ అనితకు వినతిపత్రం అందజేశారు. వార్డు ఎడ్యుకేషన్ సెక్రటరీలు వార్డు అడ్మిన్ సెక్రటరీగా పదోన్నతి పొందడం వల్ల రిటైర్మెంట్ నాటికి కనీసం జూనియర్ అసిస్టెంట్ అయ్యే అవకాశాలు కూడా లేవని ఆవేదన వ్యక్తం చేశారు. లోపాలను సరిదిద్దాలని ఐక్య కార్యచరణ సమితి ఉపాధ్యక్షుడు పల్లా కిరణ్‌కుమార్ యాదవ్, సభ్యులు, ఎడ్యుకేషన్ డాటా ప్రాసెసింగ్ సెక్రటరీల సంఘ అధ్యక్షుడు సురేష్ కుమార్, జిల్లా కార్యవర్గ సభ్యులు రేణుక, వెంకట్ తదితరులు కోరారు.

గుంతలు..

కూటమి కళ్లకు గుంతలు

గ్రాండ్ సాక్షి రిపోర్ట్

మాకు అధికారం ఇస్తే గుంతల్లేని రోడ్లు వేస్తాం.. సంక్రాంతిలోగా రహదారులను అభివృద్ధి చేస్తామని కూటమి నేతలు ఊదరగొట్టారు. ప్రజల కళ్లకు ఊహా చిత్రాలు చూపించి మైమరిపించారు. మొదట్లో సంక్రాంతి నాటికి గుంతల్లేని రోడ్లు నిర్మిస్తామని హామీ ఇచ్చారు. అది నెరవేర్చలేకపోవడంతో.. ఆ తర్వాత ఉగాదికి కొత్త రోడ్లు వేస్తామని ప్రకటించారు. దీంతో పశ్చిమ నియోజకవర్గ ప్రజలు తమ ప్రాంతంలో కొత్త రోడ్లు వస్తాయని ఆశపడ్డారు. ఉగాది దాటిపోయినా.. ఇంతవరకు కొత్తగా రోడ్లు నిర్మించలేదు సరికదా.. పలుచోట్ల కనీసం మరమ్మతులు కూడా చేపట్టకుండా వదిలేశారు. దీంతో తాము మోసపోయామని ప్రజలు మండిపడుతున్నారు. కనీసం గుంతలైనా కప్పాలని కోరుతున్నారు. గోపాలపట్నం/మల్కాపురం/విశాఖవిద్య



గుల్లలపాలెం నుంచి కోరమాండల్ వెళ్లే మార్గం

- రోడ్లు అభివృద్ధి చేస్తామని కూటమి నేతల బాకా
- ఉగాది దాటినా పట్టాలెక్కని రోడ్ల అభివృద్ధి
- పవర్‌లోకి వచ్చిన తర్వాత పట్టించుకోని వైనం
- శిథిల రహదారుల్లో ప్రజల అవస్థలు
- కూటమి సర్కారు తీరుపై మండిపాటు



గాజువాక ఆర్టీసీ డిపో ఎదురు రోడ్డు పరిస్థితి



ములగాడ నుంచి శ్రావణి షిప్పింగ్‌కు వెళ్లే మార్గం దుస్థితి

పారిశ్రామిక ప్రాంతంలో ..

58వ వార్డు ములగాడ నుంచి శ్రావణ్ షిప్పింగ్‌కు వెళ్లే మార్గం పూర్తిగా గుంతల మయంగా మారింది. చిన్న చినుకు పడితే చాలు గుంతల్లో నీరు చేరి ఆ మార్గం బురదమయంగా మారుతోంది. రాకపోకలు సాగించే వారు అదుపుతప్పి ప్రమాదాలకు గురవుతున్నారు.పాలకులు రోడ్డును సందర్శించి మూడు నెలల్లో అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. ఏడాది కావస్తున్నా అతీగతీలేదు.

59, 60 వార్డుల పరిధిలో అధ్వానం

59వ వార్డు పాతచెక్‌పోస్టు ఏరియా, గాజువాక ఆర్టీసీ డిపో ఎదురు రోడ్డుతో పాటు 60వ వార్డు గుల్లలపాలెం మహాత్మా గాంధీ షాపింగ్ కాంప్లెక్స్ వరకూ భూ గర్భ పైపులైన్ కోసం రోడ్డు తవ్వారు. ఇలా తవ్విన రోడ్డును సరిగ్గా పూడ్చకపోవడంతో ఆ మార్గం గుంతలతో నిండి ఉంది.నిత్యం వేలాది మంది ఈ మార్గాన రాకపోకలు సాగిస్తుంటారు. ఇక్కడ సమస్యతో వారు నిత్యం సతమతం అవుతున్నారు.



నక్కవానిపాలెం సేవా మార్గంలో గుంతలు

90,91 వార్డుల పరిధిలో..





బాజీ జంక్షన్ సమీపంలోని కాలనీలో మట్టిరోడ్లు

మహానగరంలో మట్టిరోడ్లు

జీవీఎంసీ 90, 91 వార్డులను అనుసంధానం చేసే రహదారి అధ్వానంగా ఉంది. ఎన్ఏడీ జంక్షన్ నుంచి బాజీ జంక్షన్ వరకు ఉంటుంది. తాటిపూడి పైప్‌లైన్ ఉన్న ఈ రోడ్డు బీఆర్‌టీఎస్ రహదారికి ప్రత్యామ్నాయ రహదారిగా ఉంది. సుమారు 10 ఏళ్ల కిందట గ్రావెల్ రోడ్డు వేశారు. అప్పటి నుంచి దీన్ని పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం ఉగాది కల్లా రహదారులు బాగు చేస్తామని చెప్పినా ఇంత వరకూ కార్యరూపం దాల్చలేదు. రహదారిని అభివృద్ధి చేయాలని స్థానికులు కోరుతున్నారు.



ములగాడ సేవా మార్గం ఇలా..

'నరక'దారులు



52వ వార్డు నేతాజీ కాలనీకు వెళ్లే రోడ్డు

విశాఖ విద్య: జీవీఎంసీ 52వ వార్డు పరిధిలోకి వచ్చే పాస్‌పోర్ట్ ఆఫీస్, నేతాజీ నగర్ మీదుగా కంచరపాలెం బీఆర్‌టీఎస్‌ను కలుపుతూ 60 అడుగుల మేర రోడ్డు విస్తరించాలని జీవీఎంసీ మాస్టర్‌ప్లాన్‌లో ఉంది. రహదారి అభివృద్ధి కోసం రూ.1.80 కోట్లు మంజూరు చేస్తూ జీవీఎంసీ కౌన్సిల్ ఆమోదం తెలిపింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పనుల్లో పురోగతి లేదు.

- ఎన్ఏడీ నుంచి కంచరపాలెం వరకు రోడ్డు అభివృద్ధికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో నిధులు మంజూరయ్యాయి. రామ్మూర్తి పంతుల పేట నుంచి న్యూకరాస, ఓల్డ్ కరాస, ప్రియాంక కాలనీ, వాసవి టవర్స్, గణేష్ నగర్, గౌరీ నగర్‌మీదగా ఎన్ఏడీ వరకు రహదారి విస్తరణతో పాటు రైల్వే ట్రాక్‌కు ఆనుకొని గెడ్డకు రిటైనింగ్ వాల్ కట్టాలి. కూటమి ప్రభుత్వం కుటిల రాజకీయాలతో పనులకు గ్రహణం పట్టింది.
- 90వవార్డు జయప్రకాష్ నగర్‌నుంచి బుచ్చిరాజు పాలెం వెళ్లేదారి అధ్వానంగా ఉంది.



90వ వార్డు జయప్రకాష్ నగర్ నుంచి బుచ్చిరాజుపాలెంకువెళ్లే దారి

కార్మికులను విధుల్లోకి తీసుకునే వరకూ ఉద్యమం

- సీపీఎం ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు

కూర్మన్నపాలెం: స్టీల్‌ప్లాంట్‌లో తొలగించిన కాంట్రాక్ట్ కార్మికులను విధుల్లోకి తీసుకునే వరకూ ఉద్యమం కొనసాగుతుందని సీపీఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు స్పష్టం చేశారు. కూర్మన్నపాలెం కూడలిలో కార్మికుల చేపట్టిన ఆందోళన శిబిరంలో శనివారం పాల్గొని ప్రసంగించారు. ప్రజలకోసం ప్రభుత్వాలు పనిచేయాలే తప్పా వారి కడుపు కొట్టకూడదని ఆయన హితవు పలికారు. మోదీ ప్రభుత్వం అందుకు భిన్నంగా పాలన సాగిస్తుందన్నారు. కార్మికుల హక్కులను కాలరాసే ప్రభుత్వాలు ఎంతో కాలం మనుగడ సాగించలేవన్నారు. గాజువాక ఎమ్మెల్యే పల్లాశ్రీనివాసరావు ఎన్నికలు ముందు కల్లబొల్లి కబుర్లుతో కార్మికల పక్షాన ఉన్నట్టు నమ్మబలికారని విమర్శించారు.



కార్మికులనుద్దేశించి మాట్లాడున్న సీపీఎం ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు

అతని మాటలు నమ్మిన ప్రజలు భారీ మెజార్టీతో గెలిపిస్తే పదవి వచ్చిన తర్వాత కార్మికులను విస్మరించి పెత్తందార్లకు కొమ్ముకాస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు జగ్గనాయుడు, అయోధ్యరామ్, బైరెడ్డి మోహన్ పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవల కల్పనకు డిమాండ్



ప్లకార్డులు ప్రదర్శించి నిరసన తెలుపుతున్న పెన్షనర్లు

డాబాగార్డెన్స్: నూతనంగా రూపొందించిన సాఫ్ట్‌వేర్ సరైన పరీక్షలు నిర్వహించకుండా మార్చడం వల్లే ఇబ్బందులు వస్తున్నాయని, తక్షణం ఆ ఇబ్బందులు తొలగించి పెన్షనర్లు, ఉద్యోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆల్ సెంట్రల్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ పెన్షనర్స్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. ఈ మేరకు శనివారం డాబాగార్డెన్స్ వెల్నెస్ సెంటర్ వద్ద సీజీహెచ్ఎస్ సమస్యలపై నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా డిఫెన్స్ కో ఆర్డినేషన్ కమిటీ చైర్మన్ రెడ్డి వెంకట్రావు మాట్లాడుతూ 40 ఏళ్లకు పైగా దేశానికి సేవ చేసి, పదవీ విరమణ పొందిన పెన్షనర్లు, వారి కుటుంబ సభ్యుల ఆరోగ్యాలతో మోదీ ప్రభుత్వం ఆటలాడుకుంటుందని ఆరోపించారు. గత ఏప్రిల్ నుంచి నేటి వరకు దేశ వ్యాప్తంగా ఉన్న కేంద్ర ప్రభుత్వ పెన్షనర్లు, కుటుంబ సభ్యులు వైద్య సేవలు పొందే విషయంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. గత నెల వరకు ఎన్ఐసీ మాడ్యూల్లో అందిస్తున్న వైద్య సేవలను సిడాక్ సాఫ్ట్‌వేర్‌లోకి మార్చారని, కొత్త మాడ్యూల్ సక్రమంగా పని చేయకపోవడం వల్ల దేశవ్యాప్తంగా వైద్య సేవలు పడకేశాయని తెలిపారు. సరైన చర్యలు చేపట్టకుండా ఇప్పుడు ఆకస్మాతుగా సాఫ్ట్‌వేర్ మార్చి వైద్య సేవలకు ఇబ్బంది కల్పిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎం. చంద్రశేఖరరావు మాట్లాడుతూ లబ్ధిదారులకు సంబంధించిన వివరాలు ఆన్‌లైన్‌లో కనిపించకపోవడం వల్ల వైద్యం కోసం ఆస్పత్రిలో చేరిన రోగులు లక్షలాది రూపాయలు చెల్లించాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. ఇన్‌చార్జ్ డాక్టర్ శ్యామ్‌కిషోర్‌బాబు మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి తమ వంతు ప్రయత్నం చేస్తున్నామని, గతంతో పోలిస్తే కొన్ని సమస్యలు పరిష్కారమయ్యాయని, త్వరలోనే మిగిలిన సమస్యలు పరిష్కరించే దిశగా ప్రయత్నం జరుగుతుందన్నారు. అసోసియేషన్ ఉపాధ్యక్షుడు రామ్మృష్ణ అధ్యక్షతన నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఎంఆర్‌డీ రాజు, రామకృష్ణ, ఆర్. సత్యనారాయణ, చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

సిరులతల్లికి తులసిపూజ

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో శనివారం తులసిపూజ నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో, అమ్మవారి త్రికాల పంచామృతాభిషేక సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ప్రతి శనివారం నిర్వహించే తులసి పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500, త్రికాల పంచామృతాభిషేక సేవలో పాల్గొనే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చని ఆలయ ఈవో కె. శోభారాణి తెలిపారు. ఆన్‌లైన్‌లో కూడా పేర్లు నమోదు చేసుకోవచ్చని చెప్పారు. కార్యక్రమంలో ఈవో కె. శోభారాణి, ఏఈవో తిరుమలేశ్వరరావు, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తప్పిపోయిన బాలలకు న్యాయ సహాయం

విశాఖ లీగల్: వివిధ కారణాల వల్ల తప్పిపోయిన బాలలకు న్యాయ సహాయం అందించేందుకు విశాఖ జిల్లా న్యాయ సేవా ప్రాధికార సంస్థ సిద్ధంగా ఉందని ఆ సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఆర్. సన్యాసినాయుడు వెల్లడించారు. విశాఖ జిల్లా కోర్టు ప్రాంగణంలోని న్యాయ సేవా ప్రాధికార సంస్థ సమావేశ మందిరంలో శనివారం తప్పిపోయిన బాలల దినోత్సవం నిర్వహించారు. నగర పోలీసు విభాగం, స్త్రీ శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్, సమాంతర న్యాయ సేవా సహాయకులు, ఇతర ప్రభుత్వ శాఖల సహకారంతో కార్యక్రమాన్ని నిర్వహించారు. న్యాయమూర్తి సన్యాసినాయుడు మాట్లాడుతూ తప్పిపోయిన బాలలకు పోలీసులు, స్త్రీ శిశు సంక్షేమ శాఖ, కార్మిక శాఖ, లోక్ అదాలత్ ఉచితంగా సేవలందిస్తాయన్నారు. ఇందుకు సంబంధించి సమాచారాన్ని తమ కార్యాలయంలో పొందవచ్చని తెలిపారు. స్పెషల్ మేజిస్ట్రేట్ 1 రామచంద్రరావు, ఏసీపీ లక్ష్మణరావు, మహిళా శిశు సంక్షేమ శాఖ పీడీ కె.వి.రామలక్ష్మి పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవా ప్రాధికార సంస్థ కార్యదర్శి సన్యాసినాయుడు

వ్యక్తిగత ఆరోగ్యంపై పోలీసులు దృష్టి సారించాలి

ఎంవీపీకాలనీ: పోలీసులు వ్యక్తిగత ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జట్టి సూచించారు. ఎంవీపీ కాలనీ మెడికవర్ ఆస్పత్రిలో శనివారం పోలీస్ సిబ్బందికి ఉచిత ఆరోగ్య పరీక్షల శిబిరం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రోజువారి విధుల ఒత్తిడిలో పోలీసులు ఆరోగ్య సమస్యలకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పోషకాలతో కూడిన మితాహారం తీసుకోవడం, వ్యాయామం చేయడం, ఒత్తిడిని తగ్గించుకోవడంపై దృష్టి సారించాలని సూచించారు. అనకాపల్లి ఎస్పీ తుహిన్ సిన్హా మాట్లాడుతూ పోలీసుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని మెడికవర్ హాస్పిటల్ సహకారంతో సిబ్బందికి ఉచిత ఆరోగ్య పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. సుమారు 750 మంది ఈ సేవలను వినియోగించుకున్నారన్నారు. గుండె, కిడ్నీ, మామోగ్రఫీ తదితర 13 రకాల పరీక్షలు మెడికవర్ హాస్పిటల్, అచ్యుతాపురానికి చెందిన రుషిల్ డెకర్స్ సహకారంతో ఉచితంగా చేసినట్లు చెప్పారు.

తొలగించిన కాంట్రాక్ట్ కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి



నిరసన తెలుపుతున్న ఆటో కార్మికులు

డాబాగార్డెన్స్: స్టీల్‌ప్లాంట్‌లో తొలగించిన కాంట్రాక్ట్ కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఏఐటీయూసీ)రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి. వామనమూర్తి డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ద్వారకాబస్‌స్టేషన్ ఇన్‌గేట్ వద్ద ఆటో కార్మికులు నిరసన చేపట్టారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను వెంటనే ఆపాలని, తొలగించిన రెండు వేల మందికి పైగా కాంట్రాక్ట్ కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలన్నారు. ఎన్నికల ముందు చంద్రబాబు, పవన్‌కల్యాణ్ ప్రతిపక్షంలో ఉంటూ స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుతామని చెప్పి, తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత నరేంద్రమోదీ కాళ్లు మొక్కుతున్నారని మండిపడ్డారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ని ప్రభుత్వ రంగంలో కొనసాగించాలని, తొలగించిన కాంట్రాక్ట్ కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని, జీతాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పలువురు ఆటో కార్మికులు పాల్గొన్నారు.